# కోవిడ్‌తో ఫికర్ వద్దు

- స్వీయనియంత్రణతో అప్రమత్తంగా ఉండాలి..
- సమిష్టి కృషితో మన రాష్ట్రంలో కరోనా వైరస్‌ను కట్టడి చేసుకున్నాం..
- అదే స్ఫూర్తితో మళ్లీ పెరగుతున్న కేసులను నియంత్రిద్దాం..
- చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుని ప్రతి ఒక్కరినీ కాపాడుకుందాం..
- కోవిడ్‌తో ఆందోళన వద్దు.. అప్రమత్తతే మనకు హద్దు
- కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి



**కొత్తగూడెం, డిసెంబర్20(కెరటం ప్రతినిధి)**

పెరుగుతున్న కోవిడ్ కేసులతో అప్రమత్తంగా ఉండాలని, కోవిడ్‌తో ఆందోళన వద్దు.. అప్రమత్తతే మనకు హద్దు అని, సమిష్టి కృషితో మన రాష్ట్రంలో వచ్చిన మూడు కరోనా వైరస్ వేరియంట్లను కట్టడి చేసుకున్నామని, అదే స్ఫూర్తితో మళ్లీ పెరగుతున్న కేసులను నియంత్రిద్దామని, చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుని ప్రతి ఒక్కరినీ కరోనా వైరస్ బారిన పడకుండా కాపాడుకుందామని కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి సూచించారు. దేశంలో వేగంగా పెరుగుతున్న కరోనా కేసుల నేపథ్యంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతదేశంలో నిన్న 142 కొత్త కోవిడ్ -19 కేసులు నమోదయ్యాయని, క్రియాశీల కేసుల సంఖ్య 1,970కి పెరిగిందని, కరోనా కారణంగా కేరళ, ఉత్తరప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో మరణాలు సైతం నమోదవుతున్నాయని, పెరగుతున్న కోవిడ్ కేసుల పట్ల ఆందోళన చెందకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైరస్ సోకిన వారికి చిన్న చిన్న లక్షణాలతో బయటపడుతున్నారని, కొందరు తీవ్రమైన అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. వృద్ధులు, హృదయ సంబంధ వ్యాధులు, మధుమేహం, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధి లేదా క్యాన్సర్ వంటి వైద్య పరిస్థితులు ఉన్నవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కోవిడ్ వ్యాప్తిని అరికట్టేందుకు ఇతరుల నుండి కనీసం 1 మీటరు దూరంలో ఉండటం, మాస్కులు ధరించడం, చేతులు కడుక్కోవడం, తరచూ శానిటైజర్ ఉపయోగించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కరోనా వైరస్‌ను ఎదుర్కోవడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతాయువతంగా ఉండాలని, స్వీయ జాగ్రత్తలు పాటిస్తే కరోనా వైరస్‌ను అంతం చేయడం సులభమేనని కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి తెలిపారు.



## మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు

**కొత్తగూడెం, డిసెంబర్20(కెరటం ప్రతినిధి)**

కొత్తగూడెం ఏరియాలోని లేడీస్ క్లబ్ మహిళలకు ఆర్టిఓఏ క్లబ్ రుద్రంపూర్ నందు, కొత్తగూడెంలో పనిచేయు మహిళల ఉద్యోగులకు, జిఎం కార్యాలయంలోని మహిళల ఉద్యోగులకు కొత్తగూడెం ఏరియా జిఎం కార్యాలయం నందు ఆటల పోటీలు సింగరేణి దినోత్సవ వేడుకలు-2023 పురస్కరించుకొని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన కొత్తగూడెం ఏరియా సేవ ప్రెసిడెంట్ జి. మధురవాణి షాలేం రాజు ఈ పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన వారికి ఈ నెల 23న శనివారం ప్రగతి వనం నందు జరుగు సింగరేణి దినోత్సవ వేడుకలలో బహుమతుల ప్రధానం జరుగునని మరియు ఈ వేడుకలకు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా సేవ ప్రెసిడెంట్ జి.మధురవాణి షాలేం రాజుతో పాటు పద్మజా రాణి కోటి రెడ్డి, ఏజీఎం (ఎఫ్ అండ్ ఏ) కే.సుమలత, పి.ఎం బి.శివ కేశవ రావు, డివైపిఎం, జీకే ఓసి ఎం.శ్రవణ్‌కుమార్, కొ-ఆర్డినేటర్ సాగర్, కొత్తగూడెం ఏరియాలోని లేడీస్ క్లబ్ మహిళలు, కొత్తగూడెంలో పనిచేయు మహిళల ఉద్యోగులు, జిఎం కార్యాలయంలోని మహిళల ఉద్యోగులు పాల్గొన్నారు.



# క్రీడాకారులు జాతీయ స్థాయిలో సత్తా చాటాలి

- క్రీడల అభివృదికి క్రీడా మైదానాలు అవసరం
- అథ్లెట్లు సబ్ జూనియర్ స్థాయి నుండి మంచి శిక్షణ తీసుకోవాలి..
- 400 మీటర్స్ సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి కృషి చేస్తా..
- కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి
- ఉత్సాహంగా జిల్లా సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్
- పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్మన్ కంచెర్ల చంద్రశేఖర్‌రావు, క్రీడాకారులు



**కొత్తగూడెం, డిసెంబర్20(కెరటం ప్రతినిధి)**

క్రీడాకారులు జాతీయ స్థాయిలో సత్తా చాటాలని, క్రీడల అభివృదికి క్రీడా మైదానాలు అవసరమని, అథ్లెట్లు సబ్ జూనియర్ స్థాయి నుండి మంచి శిక్షణ తీసుకోవాలని, 400 మీటర్స్ సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి కృషి చేస్తానని కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. భద్రాద్రి కొత్తగుడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రుద్రంపూర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్స్‌లో భద్రాద్రి కొత్తగుడెం జిల్లా సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను జిల్లా యువజన క్రీడల అధికారి ఎం.పరంధామ రెడ్డి క్రీడా జండా ఊపి బుధవారం ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుండి సుమారు 250 మంది బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భముగా అయన మాట్లడుతూ జిల్లాలో 400 మీటర్ల సింథటిక్ ట్రాక్‌కు అనువైన స్థలాన్ని సేకరించి నిర్మాణం చేసుకుంటే క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవ సభకు జిల్లా పరిషత్ చైర్మన్ కంచెర్ల చంద్రశేఖర్రావు, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి హాజరై మాట్లాడారు. ఈ కార్మిక ప్రాంతంలో క్రీడల అభివృదికి క్రీడా మైదానాలు అవసరమని, తద్వారా మంచి క్రీడాకారులు వెలుగులోకి వస్తారన్నారు. అథ్లెట్లు సబ్ జూనియర్ స్థాయి నుండి క్రీడలలో మంచి కోచ్‌లతో సాధన చేయటం ద్వారా జాతీయ పోటీలలో పతకాలు సాధించాలని తెలిపారు. అంతేకాకుండా కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో 400 మీటర్స్ సింథటిక్ ట్రాక్ నిర్మాణం కొరకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ రుద్రంపూర్ సర్పంచ్ గుమ్మడి సాగర్ ఆధ్వర్యంలో ఈ సభకు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి రాసపల్లి రాజెందర్ ప్రసాద్ అధ్యక్షత వహించగా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ బాద్యులు కాసిం హుసేన్ ,ఆదినారాయణ .ఈ పోటిలు సాయంత్రము వరకు జరుగగా జిల్లాలోని చిన్నారులు ఎంతో ఉత్సహంగా పాల్గొన్నారు. ఈ పోటీల నుండి టీం ఎంపిక చేసి గుజరాత్ రాష్ట్రంలో జనవరిలో జగబోవు జాతీయ అంతర్జ జిల్లాల అథ్లెటిక్ పోటీలకు పంపుతామని జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరి కె .మహిధర్ తెలిపారు. ఈ పోటీలను జిల్లా ఆథ్లెట్ కోచ్‌లు పి.నాగేందర్, సనంద కోరి, జన్ను గిరి ప్రసాద్, అక్బర్, సిందు పర్యవేక్షణ చేయగా, అథ్లెటిక్ ఫెడరేషన్ అబ్జర్వర్ బి.నాగమణి పాల్గొన్నారు.





## గరిమెళ్ళ పాడు నర్సరీ పండ్ల తోటలను పరిశీలన

**కొత్తగూడెం, డిసెంబర్20(కెరటం ప్రతినిధి)**

చుంచుపల్లి మండలంలోని ప్రశాంతినగర్ గ్రామపంచాయతీ పరిధిలోని గరిమెళ్ళపాడు గ్రామాన్ని స్థానిక గిరిజనుల కోరిక మేరకు బుధవారం ఐటీడీఏ భద్రాచలం ప్రాజెక్టు అధికారి ప్రీతిక్ జైన్ సందర్శించి రహదారి ప్రతిపాదన, రైల్వే ట్రాక్ పై వంతెన నిర్మాణం, మామిడి, జామ, తోటల అభివృద్ధి స్థానికులకు ఈ తోటల యందు ఉపాధి కల్పించుట, ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డ్స్, ఎకరం భూమిలో మునగ పెంపకం మొదలగు అంశాలపై సమీక్ష నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో వీరి వెంట చుంచుపల్లి తహసిల్దార్ కృష్ణ, మందా మంగమ్మ ఎంపీడీవో, గుంటి సత్యనారాయణ ఎంపీవో, సర్పంచ్ పద్మ, డేవిడ్ రాజు, ఐటీడీఏ ఏపీవో (సాధారణ) సురేష్, స్పెషల్ ఆఫీసర్ ఐటీడీఏ, పంచాయతీ కార్యదర్శులు ఎన్సిహెచ్ రఘు, భాష, ఉపేందర్, ఈజీఎస్ ఏపీవో రఘుపతి, ఈసీ పిల్లి నాగరాజు, టిఏ అనిల్, మొదలగువారు పాల్గొన్నారు.



# శభాష్ రాజశేఖర్..


- సమాజహితానికి చేస్తున్న కృషి అభినందనీయం
- పర్యావరణ సమతుల్యతకు నిత్యం మొక్కలు నాటడం గొప్ప విషయం
- వినూత్న కార్యక్రమాలతో ప్రతి ఒక్కరినీ చైతన్య పరచడం శుభపరిణామం
- మొక్కల నాటడంలో మా వంతు భాగస్వామ్యం ఉంటుంది..
- కొత్తగూడెం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కుమారస్వామి
- డాక్టర్ కుమారస్వామిని మర్యాదపూర్వకంగా కలిసిన మొక్కల రాజశేఖర్
- మొక్క అందజేసి శాలువాతో ఘన సత్కారం..



**కొత్తగూడెం, డిసెంబర్20(కెరటం ప్రతినిధి)**

సమాజహితానికి మొక్కల రాజశేఖర్ చేస్తున్న కృషి అభినందనీయమని, పర్యావరణ సమతుల్యతకు నిత్యం మొక్కలు నాటడం గొప్ప విషయమని, వినూత్న కార్యక్రమాలతో ప్రతి ఒక్కరినీ చైతన్య పరచడం శుభపరిణామమని, మొక్కల నాటడంలో మా వంతు భాగస్వామ్యం ఉంటుందని కొత్తగూడెం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కుమారస్వామి అన్నారు. డాక్టర్ కుమారస్వామిని ప్రకృతి ప్రేమికుడు, సమాజ సేవకుడు మొక్కల రాజశేఖర్ బుధవారం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు మొక్క అందజేసి శాలువాతో ఘన సత్కారం చేశారు. అనంతరం పుట్టిన బిడ్డకు డాక్టర్ గిఫ్ట్ ప్లాంట్ అనే వినూత్న కార్యక్రమం గురించి వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కుమారస్వామి మాట్లాడుతూ.. సకల జీవరాశుల మనుగడకు చెట్లు అనివార్యమైన వనరులు అని, చెట్లు జంతువులు, పక్షులు, కీటకాలు, శిలీంధ్రాలు మొదలైన వాటితో సహా విభిన్న జీవులకు ఆహారం, ఆశ్రయాన్ని అందిస్తాయని తెలిపారు. మన మొత్తం పర్యావరణ వ్యవస్థ స్థిరత్వాన్ని నిర్ధారిస్తాయన్నారు. చెట్లు వాటంతట అవే ఆహారాన్ని ఉత్పత్తి చేస్తూ.. మొత్తం జీవావరణ వ్యవస్థకు దోహదపడతాయన్నారు. ఈ ప్రయోజనాలు కాకుండా, ఔషధ శక్తులు ఉన్న చెట్లు జీవుల వ్యాధిని నయం చేయడానికి ఆయుర్వేదం వంటి సాంప్రదాయ వైద్య విధానాల సహాయంతో చెట్ల వేర్లు, కొమ్మలు, ఆకులు, పండ్ల నుండి ఔషధాలను తయారు చేస్తారని తెలిపారు. ఇలాంటి బహుళ ప్రయోజనాలు ఉన్న మొక్కలను నిత్యం నాటుతున్న మొక్కల రాజశేఖర్ అభినందనీయుడని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ సంస్థలు, ఆసుపత్రులు, స్మశాన వాటికలు, ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమలలో మొక్కలు నాటడం ప్రశంసనీయమన్నారు. అప్పుడు పుట్టిన బిడ్డలకు డాక్టర్ల ద్వారా వారికి మొక్కలు అందజేస్తూ.. బిడ్డ తల్లిదండ్రులకు బాధ్యతాయుతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఎంతో గొప్ప విషయమని, ఈ కార్యక్రమానికి తమ వంతు ప్రోత్సాహం ఉంటుందని తెలిపారు.







## డిప్యుటేషన్ల రద్దును నిలుపుదల చేయండి

### హై కోర్టుకు కొత్తగూడెం బార్ అసోసియేషన్ విజ్ఞప్తి

**కొత్తగూడెం, డిసెంబర్20(కెరటం ప్రతినిధి)**

ఖమ్మం జిల్లా నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విభజించినప్పుడు కొత్తగూడెంలో కోర్టు సిబ్బంది కొరత కారణంగా, ఖమ్మం జిల్లా నుంచి డిప్యుటేషన్ పై పంపిన 18 మంది సిబ్బంది యొక్క డిప్యుటేషన్లను రద్దు చేస్తూ తెలంగాణా హై కోర్టు ఈ నెల 14న జారీ చేసిన ఉత్తర్వులను నిలుపుదల చేయాలని కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రమేష్ కుమార్ మక్కడ్, రావిలాల రామారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి, తెలంగాణ హై కోర్టు జడ్జి జస్టిస్ ఈ.వి. వేణుగోపాల్ ను బుధవారం ఉదయం హై కోర్టులోని ఆయన ఛాంబర్ లో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు జడ్జిని బార్ అసోసియేషన్ తరపున శాలువతో సత్కరించి పుష్ప గుచ్ఛం అందించారు. కొత్త సిబ్బంది నియామకం జరిగే వరకు ఖమ్మం జిల్లా నుంచి డిప్యుటేషన్ పై పని చేస్తున్న 18 మంది సిబ్బంది డిప్యుటేషన్ రద్దు చేయరాదని కోరుతూ ఇచ్చిన వినతి పత్రాన్ని పరిశీలించిన జస్టిస్, సానుకూలంగా స్పందిస్తూ, న్యాయవాదులకు, న్యాయమూర్తులు, కక్షిదారులకు ఇబ్బంది ఏర్పడకుండా తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. తదనంతరం భద్రాద్రి వాసి అయిన జస్టిస్ నగేష్ భీమపాక ను కలిసి సమస్య తీవ్రతను వివరించగా, సమస్య పరిష్కారంలో తోడ్పాటునందిస్తానని అన్నారు. హై కోర్టు రిజిస్ట్రార్ జనరల్ (అడ్మిన్) బాల భాస్కర్‌ను కలువగా, ఈ సమస్య విషయమై నోట్ తయారు చేయమని తమకు జస్టిస్ వేణుగోపాల్ కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయని ధృవీకరించారు. ఈ మొత్తం కార్యక్రమంలో తమ వెంట ఉండి తమకు సహాయపడిన హై కోర్టు న్యాయవాది కడారు ప్రభాకర్ రావుకు రమేష్ కుమార్ మక్కడ్, రావిలాల రామారావు కృతజ్ఞతలు తెలిపారు.

## అవినీతి అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలి

### బీఎస్పీ అసెంబ్లీ ఇంచార్జ్ యెర్రా కామేష్

**కొత్తగూడెం, డిసెంబర్20(కెరటం ప్రతినిధి)**



కొత్తగూడెం రాష్ట్ర ప్రభుత్వం అవినీతి అధికారులను ట్రాన్స్ఫర్లు చేసి చేతులు దులుపుకోకుండా వీరి హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ కొత్తగూడెం అసెంబ్లీ ఇంఛార్జ్ యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యంత అవినీతి అధికారిగా పేరున్న మాజీ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్ ను బదిలీ చేయడంలో బీఎస్పీ పోరాటం ఉందని అన్నారు.కోవిడ్ ను అడ్డుపెట్టుకొని ఫార్మా రంగాలను ప్రైవేట్ ఆసుపత్రులను మేనేజ్ చేసుకుంటూ కోట్ల రూపాయలు సంపాదించారని ఆరోపించారు.ఆ అవినీతి సొమ్ముతో గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఒక ప్రభుత్వ అధికారిగా ఉంటూ నియోజకవర్గం లో అవినీతి సొమ్ముతో ఒక రాజకీయ నాయకుడి మాదిరి పెత్తనం చెలాయించాడని గడల శ్రీనివాస్ హయాంలో జరిగిన ప్రతి పనిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కంటితుడుపు చర్యగా బదిలీలు చేస్తే సరిపోదని అన్నారు హెల్త్ డైరెక్టర్ గా ఉన్న గడల శ్రీనివాస్ పై మొదటి నుంచి బీఎస్పీ ఆరోపణలు చేస్తూనే ఉందని అన్నారు వాటిని నిజం చేసే విధంగానే కాంగ్రెస్ నాయకత్వం చర్యలు తీసుకుందని తెలిపారు.ఈ విషయంలో సీబీఐతో విచారణ చేస్తే వందల కోట్ల రూపాయల కుంభకోణం బయటపడుతుందని అన్నారు ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చెనిగారపు నిరంజన్ కుమార్,బన్ను,సందెల సందీప్ తదితరులు పాల్గొన్నారు

